# సింగిల్ పేజీ కథలు

## డ్రామా

రాజశేఖర్ భూగర్భజల విభాగంలో సైంటిస్టు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినా డెప్యుటేషన్ మీద రాష్ట్ర ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్నాడు. భూగర్భజలంలో ఉండే మినరల్స్ శాతాన్ని పరీక్షించడం అతని డ్యూటీ.

ఓరోజు స్కూటర్ మీద వెళుతున్నపుడు మైల్డ్ స్ట్రోక్ వచ్చి హాస్పిటల్‌లో చేర్పించినప్పుడు సుమారు నలభై వేల రూపాయల ఖర్చుతో బ్రతికి బయటపడ్డాడు. పైగా నెల్లాళ్ల విశ్రాంతి తీసుకోవల్సి వచ్చింది. దాంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు.

ఇంతలో మరో ప్రక్క అదృష్టవశాత్తూ బి గ్రేడ్



సైంటిస్టుగా ప్రమోషన్ వచ్చి తిరిగి పేరెంట్ సంస్థ అయిన కేంద్ర ప్రభుత్వ విభాగంలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. లాస్ట్‌పే సర్టిఫికెట్‌తో పేరెంట్ సంస్థ డ్యూటీలో చేరిపోయాడు కూడా.

అయితే అసలు సమస్య ఇప్పుడే మొదలయింది.

మెడికల్ బిల్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టుకున్న అర్జీని సంబంధిత అధికారులు వాళ్లకి కావల్సిన పేపర్స్ ఇచ్చినా కూడా క్లియరెన్స్ క్లర్క్, అకౌంట్స్ ఆఫీసర్ నుంచి సూపరింటెండెంట్‌తో సహా ముగ్గురు కల్సి రాజశేఖర్‌తో నాలుగు స్తంభాలాట ఆడుకోవడం ప్రారంభించారు.

ఓ దశలో ఆ మెడికల్ బిల్‌కి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పనిచేస్తున్నప్పుడు మైల్డ్ స్ట్రోక్ వచ్చింది కాబట్టి ఆ మెడికల్ బిల్‌తో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు.

అయితే పరిస్థితుల్ని అర్థం చేసుకున్న రాజశేఖర్ లౌక్యంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పది శాతం సొమ్ముని లంచంగా ఇవ్వడానికి అంగీకరిస్తున్నట్టుగా సూత్రప్రాయంగా చెప్పాడంతే, క్లియరెన్స్ క్లర్క్ నుంచి అకౌంట్స్ ఆఫీసర్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌లు ఆ మెడికల్ బిల్‌ని చకచకా పాస్ చేసేశారు.

''నీ మెడికల్ బిల్‌ని పాస్ చేయడానికి తల ప్రాణం తోకకి వచ్చిందనుకో. ఎంత కష్టపడ్డానో తెలుసా?'' అని ఎంతో శ్రమపడ్డవాడిలా ఆఫీస్ సూపరింటెండెంట్ అన్నాడు.

అయితే విషయాన్ని అర్థం చేసుకున్న రాజశేఖర్ వెంటనే జేబుల్లోంచి ఐదు వందల రూపాయి నోట్లు ఎనిమిది తీసి ఆఫీస్ సూపరింటెండెంట్ చేతికందివ్వగానే ఆయన వెంటనే డ్రాయర్‌లోంచి మెడికల్ బిల్‌కి సంబంధించిన నలభై వేల రూపాయల చెక్‌ని రాజశేఖర్‌కి ఇచ్చి ఐదు వందల రూపాయి. నోట్లని పరిశీలనగా లెక్కపెట్టుకుని ''లెక్క సరిపోయిందనుకో. ఈ ఐదు వందల నోట్లు మన ఆర్.బి.ఐ. ప్రింట్ చేసినవేనా? లేక పాకిస్తాన్ ఐఎస్ఐ నోట్లా?'' అని హాస్యమాడబోయినప్పుడు రాజశేఖర్ నిర్లక్ష్యంగా నవ్వి-

''అసలు సిసలైన ఎసిబి నోట్లు, జాగ్రత్త సుమా'' అని హెచ్చరించాడంతే. సూపరింటెండెంట్ గాభరాపడుతూ అప్పుడే జేబులో పెట్టుకోబోతున్న ఐదు వందల నోట్లని తిరిగి గబగబా రాజశేఖర్ జేబులో పెడుతూ-''ఏంటీ ఇవి ఎసిబి వాళ్ల నెంబర్లు నోట్ చేసుకున్న నోట్లా? కొంప మునుగుతుంది. ఉన్న ఉద్యోగం ఊడుతుందిగానీ నీ డబ్బుని నీ దగ్గర ఉంచుకో'' అని బాగా తడబడుతూ అన్నాడు.

నిజానికి ఇదంతా రాజశేఖర్ ఆడిన డ్రామా మాత్రమే.

**-మద్దూరి మణిప్రసాద్**
(హైదరాబాద్)

## ఆదర్శం

టైము తెల్లవారుఝాము అయిదుగంటలైంది. ట్రింగ్..ట్రింగ్.. అంటూ అదేపనిగా మ్రోగుతున్న అలారం పీక నొక్కేసింది గౌరి విసుగ్గా బెడ్‌పై లేచి కూర్చొని. బద్ధకంగా ముసుగు తన్ని మళ్ళీ పడుకోబోయింది. కానీ తను ఆరోజునుండి వాకింగ్‌కు వెళ్ళాలని జ్ఞాపకం వచ్చింది. భర్తవైపు చూసింది. హాయిగా నిద్రపోతున్నాడు దుప్పటి నిండుగా కప్పుకొని.

"ఏమండీ! వాకింగ్‌కి వెళ్ళాలి కదా. తోడుగా వస్తానన్నారు. వస్తారా?" అడిగింది భర్తను తట్టిలేపుతూ.

"అబ్బా, బాగా నిద్ర వస్తూందోయ్. ఈరోజు నన్ను వదిలేద్దూ" అంటూనే గాఢనిద్రలోకి జారుకున్నాడు కరుణాకర్.

గౌరికి కూడా బద్ధకంగానే వుంది. తనూ పడుకుందామనే అనుకుంది. కాని "గౌరీ! మీరు తప్పకుండా రోజూ వాకింగ్ చెయ్యాలి" ఫ్యామిలీ డాక్టరు లీల మాటలు గుర్తుకువచ్చాయి. ఇక ఆలస్యం చెయ్యకుండా గబుక్కున లేచింది గౌరి. బ్రష్ చేసుకుని స్వెటర్, మఫ్లర్‌తో రెడీ అయింది. ఇంకా ఆశ చావక మరొక్కసారి భర్తవైపు చూసింది తోడుగా వస్తాడేమోనని. 'ఆదమరచి నిద్రపోతున్నాడు మానవుడు' స్వగతంగా అనుకుని వాకింగ్‌కు బయలుదేరింది గౌరి.

అప్పుడప్పుడే తెలతెలవారుతూంది. చిన్నగా చలి మొదలైంది. నిర్మలమైన ఆకాశం. ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. మొదటిసారిగా వెళ్తూంది గౌరి వాకింగ్‌కి. కాస్త బెరుగ్గా, సరదాగా, క్రొత్తగా అనిపించింది ఆమెకు. చకచకా అడుగులు వేస్తూంది కాస్త వేగంగా. వీధి చివరవరకూ వెళ్ళింది. చివరి ఇంటిగేటు తెరచిన శబ్దం అయితే అటువైపు చూసింది గౌరి.

లాయర్ కమలాంబ గేటు తెరచుకొని వస్తోంది. 'బహుశా వాకింగ్‌కేనేమో' అనుకొని "గుడ్‌మార్నింగ్